క్లుప్తంగా

యోగా గురువు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కె.గంగవరం: మండల పరిధిలోని కోటిపల్లి ప్రభుత్వ హోమియో వైద్యశాలలో యోగా శిక్షకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆసుపత్రి వైద్యాధికారి ఎస్.విజయ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలలో పురుషులు 32 గంటలు, స్త్రీలు 20 గంటలు కాంట్రాక్టు పద్ధతిలో పని చేయాల్సి ఉంటుందన్నారు. యోగాలో డిగ్రీ, పీజీ, డిప్లమో చేసిన వారితో పాటు అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు గంటకు రూ.250 చొప్పున గౌరవ వేతనం ఇస్తారని చెప్పారు. పురుషులు స్కూల్స్, చుట్టు ప్రక్కల గ్రామాల్లో, స్త్రీలు వైద్యశాల ఆవరణలో యోగా శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆసుపత్రిలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం



ప్రసన్న చదువుకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

కె.గంగవరం/కాజులూరు: మండల పరిధిలోని దంగేరు గ్రామానికి చెందిన విద్యార్థిని సరెళ్ల లక్ష్మీప్రసన్న చదువుకు దాత శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ప్రసన్న దంగేరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసింది. ఉన్నత చదువులకు ఆర్థిక పరిస్థితులు అడ్డురావడం, తల్లికి పక్షవాతం రావడంతో ఫీజులు కట్టలేక తల్లిదండ్రులు ఇంటర్ ద్వితీయ సంవత్సరంతో ఆమె చదువు మానిపించారు. విషయం తెలుసుకున్న కాజులూరు మండలం బంధనపూడి సర్పంచ్ దేగల తిరుమల వేణి సత్యనారాయణ ఆమె చదువు నిమిత్తం శుక్రవారం రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. దాతను యూటీఎఫ్ సభ్యులు అభినందించారు.

అన్నసమారాధన

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం పెదవీధిలో కృష్ణుడి ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకల ముగింపు సందర్భంగా స్థానిక యాదవసంఘం ఆధ్వర్యంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల నుంచి సుమారు మూడు వేల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మండలాభివృద్ధికి సమర్థవంతంగా పని చేయాలి



తహసీల్దార్ తేజేశ్వరరావుకు మొక్క బహూకరిస్తున్న అశోక్, ప్రసాద్ నాయుడు

మండపేట: కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారులు మండలాభివృద్ధికి సమర్థవంతంగా పని చేయాలని ఎంపీటీసీ సభ్యుడు దేవు ప్రసాద్‌నాయుడు, వైఎస్సార్ సీపీ నేత గారపాటి అశోక్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, ఆ పార్టీ జెడ్.మేడపాడు గ్రామ కన్వీనర్ తోరం శ్రీనివాస్ కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పలువురు మండల స్థాయి అధికారులను వారు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తొలుత తహసీల్దారు తేజేశ్వరరావును కలిసి మొక్కను బహూకరించారు. ఆ తర్వాత రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన పీతల దొరరాజును కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు. అనంతరం ఎంపీడీవో సత్యనారాయణమూర్తిని కలిశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పిల్లా అరవరాజు, సాధనాల శివభగవాన్ తదితరులు పాల్గొన్నారు.

జీజీయూలో ముగిసిన వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఫిక్కీ ఎనర్జీ మేనేజర్ అలీ అహ్మద్

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వాణి పథకంపై రెండు రోజులు నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. పెట్రోలియం విభాగం ఆధ్వర్యంలో విద్యుత్ వాహనాలలో ఉపయోగించి వదిలేసిన బ్యాటరీల నుంచి పర్యావరణంలో వస్తున్న వివిధ పరిణామాలు అనే అంశం పై ఈ వర్క్‌షాప్ జరిగింది. విజయవాడలోని ఫిక్కీ ఎనర్జీ మేనేజర్ మోహర్ అలీ ఆహ్మద్ మాట్లాడుతూ బ్యాటరీల వలన పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జయానందకుమార్, కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌వీఆర్ నాగలక్ష్మి, హెచ్‌ఓడీ ఎండీ అహ్మద్ షరీఫ్, హెచ్‌ఓడీ డాక్టర్ వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వాన జోరు.. అన్నదాత బేజారు

- విస్తారంగా వర్షాలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న డ్రైన్లు, పంట కాలువలు
- ప్రధాన కాలువలకు గండ్ల ముప్పు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



వర్షాలకు గొల్లపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కూరాడ డ్రైన్



గతంలో అండ్రంగి డ్రైన్‌కు గండి పడి గట్లపై నుంచి పొలాల్లోకి ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

కాజులూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో నియోజకవర్గ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు డ్రైన్లు, పంటకాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. స్థానికంగా కురిసే వర్షాలకు తోడు ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరదనీరు పంటపొలాలను ముంచెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పలు గ్రామాల్లోని ప్రధాన డ్రైన్లు, పంటకాలువల గట్లు బలహీనంగా ఉండి గండ్లు పడే పరిస్థితులు తలెత్తడంతో అన్నదాతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

ఆశాజనకంగా వరి పంట

నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రస్తుతం వరిపంట దుబ్బు కట్టే దశలో ఆశాజనకంగా ఉంది. ఈ సమయంలో భారీ వర్షాల కారణంగా బలహీనంగా ఉన్న కాలువ గట్లకు గండ్లు పడితే తమ పంటలకు తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. గతేడాది తుపానులకు నియోజకవర్గంలోని పలు డ్రైన్లు పంట కాలువలకు గండ్లు ఏర్పడ్డాయి. అప్పట్లో రైతులు తాత్కాలిక చర్యలు చేపట్టి స్వచ్ఛందంగా గండ్లు పూడ్చుకున్నారు. ఆపై తుపాను నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చిన నాయకులు గండ్ల పూడ్చివేతకు శాస్వత చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాగా ఇప్పటివరకూ ఏ ఒక్క గట్టుపైనా అధికారులు గుప్పెడు మట్టి వెయించలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కాలువ గట్లు మరింత బలహీనపడ్డాయని రైతులు చెబుతున్నారు.

20 వేల ఎకరాల్లో పంటలకు...

నియోజకవర్గంలోని గ్రామాల్లో వరిపొలాలు తూర్పు డెల్టా కాలువ శివారు భూముల్లో ఉన్నాయి. తైలాండ్ ఏరియా కావటంతో కాలువలు ఉధృతంగా ప్రవహిస్తే బలహీనంగా ఉన్న గట్లు గండి పడే అవకాశం ఉందని రైతులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గండ్లు పడితే కాలువల వెంబడి ఉన్న సుమారు 20 వేల ఎకరాల్లో వరి పంట ముపునకు గురయ్యే ప్రమాదం ఉంది. అంతేకాకుండా గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు, కాలనీలు నీటమునుగుతాయని రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బలహీనంగా ఉన్న కాలువ గట్లను పటిష్ట పరచేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అధికారులకు ఫిర్యాదు చేశాం



ప్రధాన డ్రైన్లు, పంటకాలువల గట్లు బలహీనంగా ఉన్నచోట గండ్లు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేశాం. ప్రస్తుతం వరి పంట దుబ్బుకట్టే దశలో ఉంది. ఈ సమయంలో గండ్లు పడి పంట నీట మునిగితే తీవ్ర నష్టం తప్పదు.

– పడాల శేషారెడ్డి, రైతు, మొగలిపాలెం

ముందస్తు చర్యలు చేపట్టాలి



గతంలో కాలువలకు గండ్లు పడగా అధికారులు వచ్చి అదరబెదర తాత్కలిక చర్యలు చేపట్టారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా కాకుండా గండ్లుపడే అవకాశం ఉన్న చోట ముందస్తుగానే శాస్వతరక్షణ చర్యలు చేపట్టాలి.

– వల్లెం వీరవెంకటసత్యనారాయణ, రైతు, ఆర్యావటం

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



లయన్స్ క్లబ్ రామచంద్రపురం వికాస్ అధ్యక్షుడిగా ప్రమాణం చేసిన వెంకటరమణ తదితరులు

రామచంద్రపురం: లయన్స్ క్లబ్ రామచంద్రపురం వికాస్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం స్థానిక బలుసు కల్యాణ మంటపంలో శుక్రవారం ఘనంగా జరిగింది. లయన్స్ 316బీ జిల్లా పూర్వపు గవర్నర్ బాదం బాలక్రిష్ణ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా క్లబ్ పూర్వపు గవర్నర్ వేలూరి సూర్యనారాయణ మాట్లాడుతూ లయన్స్ ఇంటర్నేషల్ సంస్థ ఉద్దేశాలు, సంస్థ చేసే సేవా కార్యక్రమలను వివరించారు. ప్రస్తుత గవర్నర్ ఈవీవీ ఈశ్వరకుమార్ మాట్లాడుతూ క్లబ్ సభ్యత్వం పెంచుతూ లయన్స్ సేవలు విస్తృతం చేయాలని క్లబ్ సభ్యులకు సూచించారు. నూతన క్లబ్ ప్రెసిడెంట్‌గా ప్రమాణం చేసిన వికాస్ కాలేజీల అధినేత వాసంశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ క్లబ్ సభ్యుల అందరి సహకారంతో, పట్టణ ప్రజలకు విస్తృత సేవలు అందించడంతో పాటూ క్లబ్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తానని ప్రతిజ్ఞ చేశారు. క్లబ్ సెక్రటరీగా వాసంశెట్టి చంద్రంబాబు, ట్రెజరర్‌గా మల్లిపూడి నవీన్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

- కౌన్సిల్ సమావేశంలో సభ్యులు
- ఎనిమిది అంశాలకు ఆమోదం



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం: పట్టణంలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి వెంటనే చొరవ చూపాలని మున్సిపల్ కౌన్సిలర్ వాడ్రేవు సాయిప్రసాద్ తదితర సభ్యులు కమిషనర్ బి.శ్రీనివాస్‌ను కోరారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం చైర్ పర్సన్ శ్రీదేవి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. సమావేశంలో మొత్తం 9 అంశాలను ప్రవేశపెట్టారు. ఒక అంశాన్ని వాయిదా వేయగా 8 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. కాగా మొదటి అంశంగా పురపాలక పరిధిలోని షాపులకు సంబంధించి వివిధ అద్దె బకాయిదారుల మీద కోర్టులో దావా చేయాలని, దానికి సంబంధించి రూ.1.91లక్షలు కోర్టుకు ఫీజు కట్టాలని ఒకటో అంశంగా సభ్యుల ముందుకు తీసుకువచ్చారు. దీనిపై కౌన్సిలర్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ మొత్తం పురపాలక పరిధిలోని ఎంత మంది అద్దె బకాయిదారులు ఉన్నారో తెలపాలన్నారు. వారందరూ కలిసి మొత్తం ఎంత బకాయిలు కట్టాలి, అనే అంశాలు లేకుండా అజెండాను ప్రవేశపెట్టారన్నారు. పూర్తి వివరాలు లేకుండా ప్రవేశపెట్టిన ఈ అంశాన్ని వాయిదా వేయాలని సభ్యులు కోరగా చైర్‌పర్సన్ మొదటి అంశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం పలువురు సభ్యులు మాట్లాడుతూ పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వెంటనే అరికట్టాలని కోరారు. సాయిప్రసాద్ మాట్లాడుతూ ప్రధాన రహదారిలోని సెంట్రల్ లైటింగ్ పోల్స్‌కు పలు మున్సిపాలిటీల్లో జాతీయ జెండా రంగులతో లైటింగ్ ఏర్పాటు చేశారని, మన మున్సిపాలిటీలోని సెంట్రల్ లైటింగ్ పోల్స్‌కు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రధాన రహదారిలో మోటారు సైకిళ్ల స్పీడుకు అడ్డూ, అదుపు లేకుండా పోతోందని, వెంటనే స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. సెంట్రల్ లైటింగ్ పోల్స్‌కు విచ్చలవిడిగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారని, వాటితో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వెంటనే ఫ్లెక్సీలు కట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కమీషనర్ బి.శ్రీనివాసులు మున్సిపల్ అధికారులు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి



ఆర్డీవోకు వినతి పత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

రామచంద్రపురం: కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీం, (యూపీఎస్) జీపీఎస్, సీపీఎస్‌లు వద్దని, పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా అసోసియేషన్ అధ్యక్షురాలు జి.సీతాదేవి, కార్యదర్శులు ఆర్.శ్రీనివాస్, ఎం.ప్రదీప్‌కుమార్, పట్టణశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరరావు మాట్లాడుతూ కేంద్రం ఆమోదించిన యూపీఎస్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. గతంలో మాదిరిగా ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే పాత పెన్షన్ విధానాన్ని తిరిగి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీవో ఎస్.సుధాసాగర్‌కు ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు. కె.గంగవరం మండల శాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు డి.శ్రీనివాస్, గోపాలకృష్ణ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు పాకలపాటి శ్రీనివాస్, రామచంద్రపురం మండల ప్రధాన కార్యదర్శి దేవీప్రసాద్, రాయవరం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, మురళీ పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులపై విద్యార్థులకు శిక్షణ



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ట్రైనర్ రాహుల్

మండపేట: తాపేశ్వరం గ్రామంలోని పోలిశెట్టి సత్తిరాజు, భూషణం జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం వృత్తి విద్యా కోర్సు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ పాఠశాల విద్యార్థులకు ఎస్ఆర్ ఇన్నోవిజన్ శిక్షకుడు ఎస్.అరుణ్ రాహుల్ కుమార్ వృత్తి విద్యా కోర్సులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి విద్య అభ్యసించిన వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన వారు శిక్షణ పొంది ఉపాధి మార్గాలు వెతుక్కోవచ్చన్నారు. వృత్తి విద్య ప్రాముఖ్యతను వివరించారు. 9, 10 తరగతుల విద్యార్థులకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, వృత్తి విద్యా కోర్సులపై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనర్ వైఎస్ రాజు, ప్రధానోపాధ్యాయుడు టీవీ సురేంద్ర చౌదరి, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో వనం - మనం



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సూచించారు. పట్టణంలోని ఏడిద రోడ్డులోని వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం 'వనం-మనం' కార్యక్రమం నిర్వహించారు. పట్టణానికి చెందిన గ్రీన్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల ఆ పాఠశాల మైదానంలోమొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.రాము, డీఈ శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, కౌన్సిలర్లు చిట్టూరి సతీష్, యరమాటి గంగరాజు, కాళ్లకూరి స్వరాజ్య భవాని, గుండు రామ తులసి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

రాయవరం: కాలుష్యం పెరిగిపోతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు.

వనం మనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాయవరం రాజేశ్వరి కాలనీ మండల పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఆయన మొక్కలు నాటారు.అనంతరం గ్రామంలో లో వోల్టేజ్ సమస్య పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎమ్మెల్యే వేగుళ్ల ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీటీసీ గంటి రోజా, స్థానిక నాయకులు వుండవిల్లి రాంబాబు, తాడి రామచంద్రారెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

తుప్పలు.. ప్రయాణికులకు తిప్పలు



కోట రోడ్డులో ప్రమాదాలకు నిలయంగా మారిన తుప్పలు

కె.గంగవరం: మండలంలోని ఏటిగట్టుపై రహదారికి ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. గత నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోటిపల్లి నుంచి కోట వరకూ ఏటిగట్టుపై తుప్పలు ఏపుగా పెరిగిపోయి ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ రహదారిలో మలుపులు ఎక్కువగా ఉండడం, దీనికి తోడు తప్పలు రోడ్డు మధ్యలోకి వచ్చేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడటం లేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏటిగట్టుకు ఇరువైపులా సుమారు మూడు కిలోమీటర్ల మేర పెరిగిపోయిన తుప్పలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

3న డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

మండపేట: మారేడుబాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వచ్చే నెల 3న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పి.లోక్‌మాన్ శుక్రవారం తెలిపారు. ఆంధ్రరాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహిస్తున్నామని చెప్పారు. మూడు కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. మొత్తం 410 మందికి పైగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు చెప్పారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు మేళాకు హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యార్థి దశలో లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ దొరరాజు

రాయవరం: ప్రతీ విద్యార్థీ లక్ష్యాలను నిర్దేశించుకుని, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మండపేట రూరల్ సీఐ దొరరాజు, రాయవరం ఎస్సై పి.బుజ్జిబాబు పేర్కొన్నారు. స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ర్యాష్ డ్రైవింగ్, ఈవ్ టీజింగ్ తదితర అంశాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ దొరరాజు మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ అమూల్యమైనదన్నారు. ఈ దశలో వేసే ప్రతి అడుగు ఎంతో జాగ్రత్తగా వేయాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెట్టుకున్న నమ్మకాన్ని విద్యార్థులు వమ్ము చేయకుండా విద్యలో రాణించాలన్నారు. కేవలం చదువుతోనే ఎంతటి ఉన్నత స్థానాలకైనా చేరుకోగలమన్నారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే ఈవ్‌టీజింగ్ చేస్తే చట్టప్రకారం చర్యలుంటాయన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాయనాడ్ బాధితులకు విరాళం



వాయనాడ్ వరద బాధితుల కోసం సేకరించిన రూ.4.50 లక్షల చెక్‌ను అంగన్‌వాడీ రాష్ట్ర యూనియన్‌కు అందజేస్తున్న జిల్లా యూనియన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: కేరళలోని వాయనాడ్ వరద బాధితుల సహాయ నిధికి అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ రూ.4.50 లక్షలు సేకరించి విరాళంగా సమకూర్చింది. యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి అధ్యక్షతన స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీ రాణి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరామమ్మలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జిల్లా యూనియన్ తరఫున సమకూర్చిన రూ.4.50 లక్షల చెక్‌ను కేరళ వాయనాడ్ వరద బాధితుల సహాయ నిధికి జిల్లా యూనియన్ ప్రతినిధులు రాష్ట్ర యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు అందజేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి పలు సమస్యలపై చర్చించి వాటి పరిష్కారాన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలపై వేధింపులు పెరిగాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్, అంగన్‌వాడీ జిల్లా యూనియన్ కోశాధికారి పి.అమూల్య, కె.సుజాత, కె.వెంకటలక్ష్మి, దైవ కృప, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెరిపివ్వని వాన

- ఎడతెరిపి లేకుండా వర్షం
- పల్లపు ప్రాంతాలు జలమయం



కె.గంగవరంలో కురుస్తున్న వర్షం



గొల్లపాలెంలో కాకినాడ-కోటిపల్లి రహదారి ఇలా..

కె.గంగవరం: మండల వ్యాప్తంగా శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. భట్లపాలిక, కోట, కె.గంగవరం, అద్దంపల్లి తదితర గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఏకదాటిగా వర్షం కురవడంతో జనసంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఉదయం నుంచి వర్షం కురవడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండల పరిధిలోని టేకి డ్రెయిన్, రాజుకాలువ, పాణింగపల్లి పాత కాలువలు వర్షపు నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పల్లపు భూములున్న అముజూరు, కోటిపల్లి, పేకేరు, భట్లపాలిక తదితర గ్రామాల్లోని వరి పొలాలు నీట మునిగాయి.

వీడని వర్షంతో స్తంభించిన జనజీవనం

కపిలేశ్వరపురం: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. ఆగస్టు నెలలో కొద్ది రోజులు మినహా వర్షాలు, తుపాన్లతో నడిచింది. ఇటీవల వాతావరణం తెరిపిచ్చిందని అనుకుంటుండగా శుక్రవారం మరోసారి కుండపోతగా వర్షం కురిసింది. శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం వరకూ చినుకులు పడుతూనే ఉన్నాయి. దీంతో చిరువ్యాపారులు తమ వ్యాపారాలను నిలిపి వేసుకున్నారు. వెదురుమూడి గ్రామంలో అత్యధికులు మోటారు సైకిళ్లపై ప్లాస్టిక్, సిల్వర్ పాత్రలు విక్రయించే లైన్ వ్యాపారం చేస్తుంటారు. వారంతా ఇళ్లకే పరిమితం అయ్యారు. కేదారిలంక, అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, వల్లూరు గ్రామాల్లోని ఇటుక బట్టీలు మూతపడ్డాయి. మండపేట పట్టణంలోని రైసు మిల్లు, కోళ్లఫారాల్లో పనిచేసే శ్రామికులు అవస్థలు పడుతూ పనులకు వెళ్లారు.

భారీ వర్షం

కాజులూరు: మండలవ్యాప్తంగా శుక్రవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. భారీ వర్షానికి జనజీవనం దాదాపు స్తంభించింది. గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాకినాడ, కోటిపల్లి రహదారిలో చెరువుగట్టు సెంటరు వద్ద భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. రోడ్డు మునిగిపోవటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.